

# రాజరాజు

[ చరిత్రాత్మక నాటకము ]

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

## మొదటి రంగం

అది సాయంకాలం.

అప్పటికి నాలుగు గడియల పొద్దు మాత్రమే వుంది.

పైని నల్లని ఆకాశం. కింద వినీలజలగంభీరమైన అఖండగోదావరి.

ఆ గోదావరిలో, ఆ ఆకాశం వొరుసుకుంటూ, నల్ల శాణపురాళ్లతో నిర్మితమై, వుక్కు కొండలవంటి బురుజులతో, రాజమహేంద్రపుర దుర్గం యొక్క పశ్చిమప్రాకారం, మహాసముద్రంలో బ్రహ్మాండమైన వోడల వరసలాగ భయంకరం అయిన్నీ చూడ సొంపుగా వుంది.

అద్దరిని, విశాలమైన యిసకతిప్పమీద, వందల కొద్దీ యువకులు చేరి, రకరకాల ఆటలు ఆడుకుంటున్నారు.

అక్కడ కోసున్నర వెడల్పు వుండిన్నీ, అది ఫాల్గున మాసం కనక, అరకోసెడు వెడల్పునమాత్రమే నీరు ప్రవహిస్తోంది.

ఝూమ్మని విసురుతూ వున్న పైరుగాలికి నది అంతా తరంగకల్లోలం అయిపోయి వుంది.

పౌరులలో అనేక వృత్తులవారూ, అనేకరకాలవారూ, అనేకతాహతులవారూ వందల డింగీలలో వుయ్యాలా లూగుతూ నదీవిహారం చేస్తున్నారు.

ఆ డింగీల తెరచాపలు తెల్లని మేఘశకలాలలాగ మెరుస్తూ గోదావరి కొక వినూతనశోభ కూరుస్తున్నాయి.

ఆ డింగీల మధ్య, వొకటి రెండు మదపు టేనుగులు ఈతా లాడుతూ, తొండాలతో నీళ్లు చిమ్ముతూ, డింగీలలో వున్నవారికి దడా సందడీ కలిగిస్తున్నాయి.

కోటకి వుత్తరాన పరిచారకులు నదిలో గుర్రాలు కడుగుతున్నారు.

కోటకి దక్షిణాన, స్నానాలు చెయ్యడానికీ, సంధ్యావందనాలు చేసుకోడానికీ విడివిడిగానూ, జంటజంటలుగానూ, గుంపులుగుంపులుగానూ బ్రాహ్మలు మూగుతున్నారు.

నీలాటిరేవు లన్నీ బిందెలతో వచ్చే పోయే జవరాళ్లతో కిక్కిరిసి వున్నాయి.

నీటిలో వున్న పడమటి బురుజులు తొమ్మిదింటిలోనూ నడిమిదానిమీద, పిట్టగోడకి ఆనుకుని,

రాజరాజనరేంద్రుడూ నన్నయభట్టూ కొంచెం యెడం యెడంగా తూర్పుమొగాలుగా నుంచుని వున్నారు.

రాజుకి వుత్తరాన, కొంచెం ముందుకి, అష్ట ప్రధానులలో వొకడైన మహారుద్రయ్య నుంచుని వున్నాడు.

రాజరాజు చేతిలో కొన్నీ, నన్నయభట్టు చేతిలో కొన్నీ, మహారుద్రయ్య చేతిలో కొన్నీ చిత్ర పటాలున్నాయి.

అప్పటికి, పటాలన్నీ ముగ్గురూ వొకమాటు తిరగవెయ్యడం అయిపోయింది. రాజు కోరికమీద, మళ్లీ వొక్కొక్కటే సవిమర్శంగా చూస్తూ నన్నయ భట్టు మంచిచెడ్డలు వివరిస్తున్నాడు.

రాజరాజు—(నన్నయ చేతిలో వున్న పటం చూస్తూ) ఆకళ్లు ఎంత ఆకర్షకంగా వున్నాయో చిత్తగించారా?

నన్నయ—చిత్తం మహాప్రభూ! ఈ కళ్లల్లో మంచితేజస్సుంది. ఈ చూపులు అతినిశితాలయి వున్నాయి. నిదానించగా, యీ రాజపుత్రి, వురిమిచూసి యెలాంటి వారినీ కూడా నీరుచేసెయ్యగలదని తోస్తూ వుంది.

రాజరాజు—ఇంకా సెలవివ్వించండి.

నన్నయ—ఈ యువతి కామిని అని నిష్కర్షగా చెప్పవచ్చు.

రాజరాజు—అది సరే. ఆకనుదమ్ములు మహాలక్ష్మీవిలాసమందిరాలనడానికేమయినా ఆక్షేపణ వుందా?

నన్నయ—(పటంకేసి చూస్తూ వుంటాడు)

రాజరాజు — ఆభ్రూవిలాసమూ, ఆ నుదురూ, ముఖ్యంగా ఆచుబుకమున్నూ చిత్తగించండి.

మహారుద్రయ్య—భట్టారకుల వారింకా ఆ కనుదమ్ముల విషయం—(అర్ధోక్తి)

రాజరాజు—(ఊరుకోండి అన్నట్టు తల వూపి మహారుద్రయ్యని వారిస్తాడు)

నన్నయ —(మహారుద్రయ్యకేసి చూస్తూ) ఏమి సెలవు?

మహారుద్రయ్య—నా జిజ్ఞాస తరవాత విన్నవించుకుంటాను. ముందు, ప్రభువువారికి, భ్రూవిలాసాదికం వివరించండి.

నన్నయ—చిత్తం. (రాజుతో) మహాప్రభూ! ఈ భ్రూవిలాసం అనన్యసాధారణంగానే వుంది. అయితే, ఇందులో వెనకతీత యెరగని పట్టుదలా, విరామం యెరగని కసీ ద్యోతకం అవుతున్నాయి.

మహారుద్రయ్య—(ఉలిక్కిపడతాడు)

రాజరాజు — సెలవివ్వించండి.

నన్నయ—విశాలమైన యీ లలాటం అసాధారణమైన కల్పనాశక్తిని స్ఫురింపచేస్తూ వుంది.

మహారుద్రయ్య — (రాజుకేసి చూస్తాడు)

రాజరాజు—చిత్తం.

నన్నయ—మలచినట్టున్న యీ చుబుకమే మొగానికి చక్కని కళ కూర్చింది.

రాజరాజు—దానివల్లనే ఆమొగానికి, యిందాకా నేను మనవి చేసిన ఆ ఆకర్షకత్వం యేర్పడిందని నావుద్దేశం.

మహారుద్రయ్య—(నన్నయతో) ప్రభువువారు—(అర్ధోక్తి)

రాజరాజు—(మళ్లీ చూపులతో మహా రుద్రయ్యను నిషేధిస్తాడు)

మహారుద్రయ్య—చిత్తం మహాప్రభూ!

నన్నయ—(మహారుద్రయ్యకేసి ఓర చూపులు చూస్తూ శిరఃకంపం చేసి) తెలిసింది. అవగాహన అయింది. ఏలినవారి దృష్టిలో యీమె వరణీయ అని వున్నట్టుంది. (రాజుతో) ఇక వివరాలు చూడవచ్చునా ?

రాజరాజు—చిత్తం, చూడవచ్చు.

నన్నయ—(పటం తిప్పి వెనకవేపున చూస్తూ) జక్కులదీవి మండలేశ్వరులు రామభద్రరాజులుంగారి కొమార్త చిత్రాంగీదేవమ్మగారు—(అని చదివి, రాజుతో) మనవి చెయ్య మని సెలవా ?

రాజరాజు—అభ్యంతరం యేమిటి ?

నన్నయ—(ఒక్కమాటు కళ్లుమూసుకుని ఆలోచించి) మహాప్రభూ! ఏవిధంగా చూసినా యువరాజులుంగారి గాంభీర్యం నేనెంతమాత్రమూ సమన్వయ పరుచుకోలేకుండా వున్నాను.

రాజరాజు—చిత్తం.

నన్నయ—వారి హృదయం యెదట వొక్కొక్కప్పుడు నవనీతం అతికఠినం అనీ, వొక్కొక్కప్పుడు వజ్రం అతిమృదులం అనీ అనిపిస్తూ వుంటుంది.

రాజరాజు—చిత్తం.

నన్నయ—మరిన్నీ, వారొక్కొక్కప్పుడు ఎంతో ఆశగా వుంటూ హఠాత్తుగా నిర్లిప్తు లవుతారు. విరక్తులుగా కనపడుతూ వొక్కొక్కప్పుడు గభీ మని ఆశాదృష్టులు పరుపుతారు.

రాజరాజు—చిత్తం.

నన్నయ—అదలా వుండగా — ఈ రాజపుత్రిని చూడగా, పాండవపట్టమహిషి ద్రౌపదీదేవమ్మవారు నాకు స్ఫురణకు వస్తూ వున్నారు.

రాజరాజు—ఇది అపూర్వ మైన సంగతి.

మహారుద్రయ్య — అంతమాత్ర మే కాదు— (అర్ధోక్తి)

నన్నయ—ఇంకేమి సెలవు ?

రాజరాజు—(మహారుద్రయ్యతో) మీరుండండి. (నన్నయతో) తమ అభిప్రాయం సెల విప్పించండి.

నన్నయ—(ఒక్కమాటు మహారుద్రయ్యకేసి కొంచెం చురుగ్గా చూసి, తరవాత రాజుతో) మనవిచేసుకుంటాను. మనవిచేసుకుంటూనే వున్నాను.

రాజరాజు— అమ్మవారికీ, యీ రాజపుత్రికీ పోలిక యేమిటి ?

నన్నయ — పట్టుదలా, కసీ ఈమెకి చాలా యెక్కువ అని చెప్పినప్ప డింకా వివరాలు ఆవశ్యకమా? మనవి చేసుకోడానికి నాకేమీ ఆక్షేపణ లేదు కాని— (అర్ధోక్తి)

రాజరాజు—సెల విప్పించండి.

నన్నయ—(మళ్లీ వొకమాటు పటం చూసి, మహారుద్రయ్యకేసిన్నీ చూసి, ఉద్రేకం అణుచుకుంటూ రాజుతో) ద్రౌపదీ దేవమ్మవారి నిమిత్తాన రక్తనదులు ప్రవహించాయి. కురుకులం నిర్మూలమే అయిపోయింది.

రాజరాజు—(ఉలిక్కిపడి మహారుద్రయ్యకేసి చూస్తాడు)

మహారుద్రయ్య—(రాజుకేసి చూస్తూ) భట్టారకులవారిప్పుడు పూర్తిగా కవితా సమాధిలో వున్నారు.

నన్నయ—(మహారుద్రయ్యతో నిక్కచ్చిగా) కనకనే నేనలా చెప్పగలిగాను. తమరు సరిగా గుర్తించారు.

రాజరాజు — (మహారుద్రయ్యతో) అదే కాదూ వారికి మహర్షి పదవి సమకూర్చినది? (నన్నయతో) తమరు మహాభారతం క్షుణ్ణంగా పరిశీలించి వుండడమూ, నా జన్మ సాఫల్యం నిమిత్తం తమరిప్పుడది ఆంధ్రీకరిస్తూనే వుండడమూ—ఈ సన్నివేశం తమకలాంటి స్ఫురణ కలిగించి వుండవచ్చు. అయితే, నేను తమంత నిక్కచ్చిగా మనవి చేసుకోలేను; గాని ఈ రాజపుత్రి ప్రవృత్తి పురుషుణ్ణి వుడుకెత్తిస్తుందనడానికి మాత్రం యేమీ సందేహం లేదు. ఆ పురుషుడు నిగ్రహశక్తి లేనివాడయితే తమరు సెలవిప్పించింది కొంతవరకున్నా సంభవించకా మానదు.

నన్నయ — కృతార్థుణ్ణి. ఏలినవారున్నా అలాగే భావించడం—(అర్థోక్తి)

మహారుద్రయ్య—కాని భేదం మాత్రం స్ఫుటంగానే కనపడుతూ వుంది. ప్రభువువారు, పురుషుడు నిగ్రహశక్తి లేనివాడయితేనే అది అలా సంభవిస్తుందని—(అర్థోక్తి)

నన్నయ—విన్నాను. ఇప్పుడు హెచ్చుగానూ బోధపడింది. కాని వొకరి నిగ్రహానుగ్రహ సామర్థ్యాలను బట్టి మారిపోయేదయితే అది ప్రవృత్తి అనిపించుకుంటుందా?

రాజరాజు — (మహారుద్రయ్యకేసి చూస్తాడు)

మహారుద్రయ్య — (రాజుతో) మనవి చేసుకుంటాను మహాప్రభూ! (నన్నయతో) అయితే, ముందు తమరొకటి ఆలోచించగోరుతున్నాను. ఏమిటంటే? ఆ రాజపుత్రి ప్రవృత్తి అలాంటిదే అని వాదానికి స్థిరపరుచుకుందాం. అయితే, ఆమెను చేపట్టే రాజపుత్రుడు ఎలాంటివారినిన్నీ లోపు చేసుకోగలవాడయితే అప్పుడేమి చెప్పవలసి వుంటుంది?

రాజరాజు —(నన్నయకేసి ఉత్సాహంగా చూస్తూ శిరస్సు పంకిస్తాడు)

నన్నయ—(మహారుద్రయ్యతో) తమ పూర్వపక్షం సుసంగతంగా లేదు. ఎంచేతనంటారా? "ఈమె ప్రవృత్తి యెలాంటిది" అని మన జిజ్ఞాస. "ఏమవుతుంది?" అని కాదు.

రాజరాజు—పోనీ, వారి సందేహం కూడా కొంచెం తీర్పించండి.

మహారుద్రయ్య—(నన్నయతో, అంజలి బంధంగా) అదీ నా ప్రార్థన.

నన్నయ—(రాజుతో, తాపీగా) చిత్తం. అలాగే మహాప్రభూ! (మహారుద్రయ్యకేసి చూస్తూ, దృఢస్వరంతో) బలీయాలైన రెండు ప్రతికూలశక్తులకు ఏకత్రానున్న సంఘర్షణ తటస్థపడితే, అక్కడ, పర్యవసానం, అతిదారుణంగా వుంటుంది; గాని వాటిలో వొకటి రెండోదానికి లొంగిపోవడం అంటూ కలగదు.

రాజరాజు — (మెరుపుకొట్టినట్టయి మహారుద్రయ్యకేసి చూస్తాడు)

మహారుద్రయ్య—(చెయ్యెత్తలా వూపుతూ రాజుతో) వారి కలా తోచింది.

నన్నయ — (మహారుద్రయ్యతో, కొంచెం చురుగ్గా) మరి తమకు?

మహారుద్రయ్య—(రాజుకేసిచూస్తాడు)

రాజరాజు—అలాగే కావచ్చు; కాని, మహాకవీ! మనం విషయదూరులం అయి పోతున్నాము. ఈ రాజపుత్రికలలో, అబ్బాయికి, అనురూపురాలెవతె అని కదా మన జిజ్ఞాస?

నన్నయ—మన మిప్పుడాపనిలోనే నిమగ్నులమయి వున్నాము కాదూ మహాప్రభూ?

మహారుద్రయ్య — (రాజుతో) నా దొక్క మనవి.

రాజరాజు—చెప్పండి.

మహారుద్రయ్య — ఇది విషయమా విషయాంతరమా అన్నది వ్యర్థచర్చ.

రాజరాజు—ఏమిా?

మహారుద్రయ్య—దీనికి ప్రయోజనం?

రాజరాజు—అంటే?

మహారుద్రయ్య — చిత్రపటాలకోసం వెళ్లినవారిలో యింకా యిద్దరు రావలసే వున్నారు.

రాజరాజు—అయితే?

మహారుద్రయ్య—వారు కూడా వచ్చి, వారు తెచ్చిన పటాలున్నూ పరిశీలిస్తే కాని మనం నిష్కర్షగా యేమీా తేల్చుకోడానికి వీలు లేదు.

రాజరాజు—(ఆలోచిస్తున్నట్టూ, మహారుద్రయ్య భావం గ్రహించినట్టూ నటిస్తూ) అవునవును.

మహారుద్రయ్య — భట్టారకులవారికి మాత్రం యిది తెలవందా?

నన్నయ—(తల పంకిస్తూ మహారుద్రయ్యకేసి చూసి వూరుకుంటాడు)

రాజరాజు — (నన్నయతో) ఏమి సెలవు?

నన్నయ—ఏవిషయమై మహాప్రభూ?

రాజరాజు — మహారుద్రయ్యగారు చెప్పింది—(అర్థోక్తి)

నన్నయ—విన్నాను. అయితే, యే విషయమైనా అమాత్యులకు తోచడంలో విశేషం వుంది.

రాజరాజు—తమకూ నాకూ కూడ అది—(అర్థోక్తి)

నన్నయ — తెలవనే తెలుసు మహాప్రభూ! ఆవిషయం తమరున్నూ మళ్లీమళ్లీ సెలవిప్పించాలా? కాని రామభద్రరాజులుంగారి కౌమార్త ప్రవృత్తి నిర్ణయించడం వొకటీ, యువరాజులుంగారికి వధువును నిర్ణయించడం మరొకటీని. అక్కడక్కడ అభిప్రాయం కొంచెం భేదిస్తూ వచ్చినా, యిప్పటి దాకా, మనం కొందరు రాజపుత్రికల ప్రవృత్తిని గురించి వొకవిధంగా పరిష్కారం చేసుకునే వున్నాము; కాని రామభద్రరాజులుంగారి కౌమార్త విషయం ఆలోచనలో వుండగా అమాత్యులవారు విషయాంతర ప్రస్తావనకి దింపారు. అది విడిచిపెట్టడానికి వీలులేని సందర్భాలున్నూ వారు కల్పించారు.

మహారుద్రయ్య—సత్యం సత్యం. చర్చ అంటే నాకు చాలా వుబలాట మనీ, అది

వుంటే నాకు నిద్రాహారా లక్కరలే దనీ ప్రభువువారికీ తమకిన్నీ తెలిసిందే.

నన్నయ—అయితే, ప్రభువు ఒకానొక విషయమై ఏకాగ్రంగా పర్యాలోచన చేస్తూ వున్నప్పు డేనా తమ వుబలాటాలు ?

మహారుద్రయ్య—అది కాదు, తమరు—(అర్ధోక్తి)

నన్నయ — తమ రింతకు ముందు వాడిన మాటల్లో వున్న దదే. ఇప్పుడు వేరే మాటలు వాడబోతున్నా రేమో?

రాజరాజు—ఏది యేమయినా మనం మళ్లీ దారిలోకి రానే వచ్చాము కదా? (మహారుద్రయ్య కేసి కొంచెం చురుగ్గా చూసి, మళ్లీ నన్నయతో) అప్రస్తుత ప్రశంస లనుకున్న వాటికి తమరు ప్రత్యుత్తరా లివ్వ డం మాత్రం యెందుకూ ?

మహారుద్రయ్య—నేను మనవి చేసుకునేది—(అర్ధోక్తి)

రాజరాజు—(మహారుద్రయ్యతో) భట్టారకులవారు సెలవిచ్చే పర్యవసానం మనం ఆలకిద్దాం.

మహారుద్రయ్య—దాని కేమి ఆక్షేపణా ? వారి ప్రసంగం యెవ రడ్డుకోగలరూ? కాని మళ్లీ ఆసంగతే అందుకుందా మంటే సోమయాజులవారి కనుష్ఠానసమయం ఆసన్నం అయిందికదా ?

రాజరాజు— (సూర్యబింబం కేసి చూస్తాడు)

నన్నయ—(తానున్నూ సూర్యబింబం చూసి) మహారుద్రయ్యగారి సమయస్ఫూర్తి యిప్పుడే కా దెప్పుడూ అసాధారణమే. అది వొకొక్కప్పుడు ఆవర్తాలు కల్పించి — సరే, యీవిషయం మళ్లీ ప్రస్తావనకు వచ్చి నప్పుడు చూసుకుందాము.

రాజరాజు — (మహారుద్రయ్యతో) ఇంతలో యిది తేలేదిన్నీ కాదు, తేల్చ డానికి వీలూ చాలదు. (నన్నయతో) తమరు—(అర్ధోక్తి)

నన్నయ—నా కిప్పటికి సెలవు దయ చేయించండి.

రాజరాజు—చిత్తం, ఇంకొక్క క్షణంలో మేమున్నూ బయలుదేరతాము. ఏమి మహారుద్రయ్యగారూ! భట్టారకులవారి నిమిత్తం రథం సిద్ధంగా వున్నదా?

మహారుద్రయ్య — (కిందికి చూసి) చిత్తం, రథమూ పాలకీ గూడా సిద్ధంగా వున్నాయి. వారి వుత్సాహం యెలా వుంటే అలా దయచెయ్యవచ్చు.

నన్నయ—(చిత్రాంగి పటం రాజరాజు కందించి, తక్కిన పటాలలో కొన్ని మహారుద్రయ్య కిచ్చి) వీటివిషయం పరిష్కారం అయిపోయింది. (మరికొన్ని పటాలు మళ్లీ వుంచి) ఇక వీటివిషయం తేల్చవలసి వుంది.

రాజరాజు— చిత్తం. మరి మాకు సెలవు దయచేయించండి.

నన్నయ— చిత్తం చిత్తం, సెలవు. (వెనక్కి వెనక్కి నడుస్తూ బయలుదేరతాడు.)

మహారుద్రయ్య — (వెంటవెడుతూ) ఉదయం తమ అనుష్ఠానం ముగిశాటప్పటికి దర్శనం చేసుకుంటాను.

నన్నయ—చిత్తం చిత్తం, నిరీక్షిస్తూ వుంటాను.

మహారుద్రయ్య — సెలవు.

నన్నయ — సెలవు.

(నన్నయ వెళ్ళిపోతాడు. మహారుద్రయ్య రాజు దగ్గిరికి వస్తాడు)

రాజరాజు — (చిత్రాంగి పటంచూస్తూ) ఏమి రూపమూ? ఎంత రాజసమూ? ఇంతటి తేజశ్శాలిని యింతవరకూ మన కళ్ళబడలే దేమీ? (పక్కగా కిందికి చూస్తూ) తక్కిన వన్నీ మహారుద్రయ్యగారి కిచ్చి, భట్టారకుల వారు, ఈ వొక్కపటమూ మన కిచ్చా రేమీ?

మహారుద్రయ్య — (తన యథాస్థానం లోకి వచ్చి) ప్రభూ!

రాజరాజు — (మెరుపుకొట్టిన ట్టయి) అయితేనూ? భట్టారకులవారి ధోరణి మీకు నచ్చినట్టు లేదే?

మహారుద్రయ్య — చిత్తంచిత్తం, తమరు సెల విప్పించింది చాలామట్టుకు సత్యమే.

రాజరాజు — ఇవాళ వారు బాగా వుద్రిక్తు లైనారండీ.

మహారుద్రయ్య — కారణం — (అర్ధోక్తి)

రాజరాజు — ఆ, కారణాని కేం వుందీ? రథం వెళ్ళగానే అలా భారతరచన కట్టిపెట్టి యిలావచ్చి వుంటారు. వారి చిత్తం పూర్తిగా ప్రకృతిస్థం కాకుండానే మళ్ళీ పటాల పరి శీలనలో పడవలసివచ్చివుంటుంది.

మహారుద్రయ్య — అలాగే తోస్తోంది మహాప్రభూ! అయితే, నిజానికి, భట్టారకుల వారు గొప్పపండితులే. మహామేధావులే. కవి సార్వభౌములే. అనుభవసంపన్నులున్నూ. అయినా, వారి నిర్ణయం నాకు ప్రమాదపతి తంగా కనపడుతోంది.

రాజరాజు — మొత్తానికి తొందర లేక పోలేదు.

మహారుద్రయ్య — ఇప్పటివరకూ మన చేతికి వచ్చిన పటా లన్నీ చూడగా — (అర్ధోక్తి)

రాజరాజు — ఇక రావలసినవి మనం ఎరగనివి టండీ?

మహారుద్రయ్య — కనక జక్కులదీవి రాజపుత్రిక మాత్రమే సర్వలక్షణసంపన్న అని నానిశ్చయం.

రాజరాజు — అదే నేనూ అంటున్నాను. భట్టారకులవారున్నూ యిందు కంగీకరించక పోలేదు.

మహారుద్రయ్య — వారేం సెలవిచ్చినా ఆమెని తిరస్కరించడం జరుగుతుం దేమో అని నామనస్సు గజిబిజి అయిపోతోంది. మహారాణులకు వుండవలసిన పొంకం అంతా ఆమెలో మూర్తీభవించివున్నది.

రాజరాజు — (సాలోచనగా పక్కకి చూస్తూ, తల పంకిస్తూ) మహారాణులకు వుండవలసిన పొంకం! (పటం చూస్తూ) నిస్సందేహంగా. (మహారుద్రయ్యతో) ఈమె చళుక్యమహారాణి కావాలి. అయితీరాలి. ఇదేనా మీనిష్కర్ష?

మహారుద్రయ్య — చిత్తం చిత్తం, అంతే మహాప్రభూ!

రాజరాజు — మీరు చెప్పింది సర్వా త్మనా యుక్తంగా వుంది; కాని భట్టారకుల వారి మాట అంటే అబ్బాయికి వేదవాక్యమే.

వారికి నచ్చనిది అతనికి పరిహార్యమే. మరి దారి?

మహారుద్రయ్య—అబ్బాయిగారు వల్ల కాదనడం—(అర్ధోక్తి)

రాజరాజు—(ఆలోచిస్తూ) అత నలా అంటా డనే నిష్కర్ష. ఏమీ సందేహం లేదు.

మహారుద్రయ్య—క్షీరకంఠులైన అబ్బాయిగారు వల్ల కాదంటే, సర్వవిధాలా అర్హురాలైన త్రిభువనసుందరి—(అర్ధోక్తి)

రాజరాజు—ఈమె త్రిభువనసుందరే. లోకైకసుందరే. ఎవరు కాదనగలరూ?

మహారుద్రయ్య — చిత్తం చిత్తం, అలాగే, ఆమె చళుక్య మహారాణి కాగూడదని యెవరూ అనగలిగిన్నీ వుండకూడదు.

రాజరాజు—అది నిశ్చయమే. (కిందుగా పక్కకి చూస్తూ ఆలోచన నటిస్తూ) పోనీ, యీమె పట్టమహిషి కాకపోతే ఆ దోషం పరిహారమైపోతుం దేమో ఆలోచించండీ.

మహారుద్రయ్య — (మహోత్సాహంతో) బాగుంది. ఇది చాలా బాగుంది మహాప్రభూ! ఎక్కడికి వెళ్లినా యిది తిరుగులేని ఆలోచన. మరిన్నీ, భట్టారకులవారు "ఈమె కామిని" అని సెలవిచ్చారు. కామిని భోగిని కావడమే ధర్మం.

రాజరాజు—అవును సుమండీ.

మహారుద్రయ్య — శ్రీకృష్ణులవారికి సత్యభామా దేవమ్మగారు—(అర్ధోక్తి)

రాజరాజు—(ఉప్పొంగుతూ) సెబాస్! నాకున్నూ అదే తోచింది. రుక్మిణీదేవమ్మ గారు సాక్షాత్తూ ఆ శ్రీ మహాలక్ష్మీదేవమ్మవారే కనక వారిని గురించి ప్రస్తావించడానికి మనం అనర్హులం. ఈకారణంవల్లనే వారి అంతఃపురికవిలాసాలు వర్ణించడానికెవరూ సాహసించలేకపోతూ వచ్చారు. కాగా,యిక సత్యభామా దేవమ్మగారి విషయం. నిజానికి, వారివల్లనే శ్రీకృష్ణులవారి రసికత సార్థకం అయింది. శ్రీకృష్ణులవారి దక్షిణనాయకత్వం కూడా వారివల్లనే రూఢమై రసబంధురమున్నూ అయింది.

మహారుద్రయ్య — సత్యం సత్యం. ఇందులో ఇంకొక విశేషం కూడా వున్నది మహాప్రభూ! అదేమిటంటే? సత్యభామా దేవమ్మగారివల్లనే శ్రీకృష్ణులవారికి లాగే, శ్రీకృష్ణులవారివల్లనే సత్యభామా దేవమ్మ గారికిన్నీ విశిష్టత యేర్పడింది. తండ్రిగా రామెని అక్రూరులవారికో, కృతవర్మశతధన్వులలో వొకరికో యిచ్చి వివాహం —(అర్ధోక్తి)

రాజరాజు — (చెవులు మూసుకుని) శివశివా!......అది తలుచుకుంటేనే—అలా అనుకుంటేనే శరీరం జలదరిస్తోంది. (గాభరా నటిస్తాడు)

మహారుద్రయ్య — శృంగారరసంలో వుండుకున్న నిగ్గంతా తుణ్ణంగా గుర్తించగలిగినవారు కనక, దానిమాధుర్యం అనుభవించగలిగినవారున్నూ కనక తమరు —(అర్ధోక్తి)

రాజరాజు — అలా అన్నారు గదా? అయితే, (చిత్రాంగి పటం చూపిస్తూ) ఇలాంటి త్రిభువనసుందరిని ఏలుకోవా లంటే, ఎంత పాండిత్యం — ఎంత రసికత — ఎంత

అనుభవం కూడా వున్నవాడు కావాలో (సాకూతంగా చూస్తూ తల యెగరవేస్తాడు)

మహారుద్రయ్య— (ఏదో నిగూఢవిషయం స్ఫురించినట్టు చకితుడై) అబ్బాయిగారి పాండిత్యం హద్దులేనిదే. సందేహం లేదు కాని—(అర్ధోక్తి)

రాజరాజు—ఇందులో యింకో సంగతి కూడా వుంది చూశారూ?

మహారుద్రయ్య—సెలవిప్పించండి.

రాజరాజు—సత్యభామా దేవమ్మగారిని తప్పించి చూడండీ. శ్రీకృష్ణులవారి అంతఃపురంలో గాఢాంధకారం తప్ప — మరేమయినా—(ఊరుకుంటాడు)

మహారుద్రయ్య—అవునుమహాప్రభూ! సామాన్యసంసారి అంతఃపురానికీ దానికీ భేదం లేదు.

రాజరాజు—దీన్నిబట్టి చూస్తే భట్టారకులవారు సెలవిచ్చిన పోలిక కూడా పూర్వపక్షం అయిపోతూ వుంది.

మహారుద్రయ్య—నిజమే. జక్కులదీవి మండలేశ్వరుల కొమార్తగారిని చూస్తే సత్యభామా దేవమ్మగారు స్ఫురణకు రావాలి; కాని ద్రౌపదీ దేవమ్మవారు కారు.

రాజరాజు—అదీ మాట. పైగా, శ్రీకృష్ణులవారు, సత్యభామా దేవమ్మగారి నిమిత్తాన, అరసికుడూ—అంటే అనర్హుడూ అయిన శతధన్వుణ్ణి సంహరించి కూడా వున్నారు; కనక, యిక్కడ, భట్టారకులవారు తెచ్చిన రత్ననదుల ప్రస్తావనకు విప్రతిపత్తి యేమీం లేదు.

మహారుద్రయ్య—అవును మహాప్రభూ!

రాజరాజు—ఇదంతా చూస్తే, రామభద్రరాజు కూతుర్ని మాత్రం విడిచిపెట్టడానికి వీలు లేదు.

మహారుద్రయ్య— ప్రధానమైన విషయం అదీ. నా ఆందోళన తీరింది మహాప్రభూ!

రాజరాజు — కనక అలా యేర్పాటు చేతాం. భట్టారకులవారిని ఈవిషయమై మన మిక శ్రమపెట్టవలసిన అక్కర కనపడదు.

మహారుద్రయ్య—ఇంకెందుకూ? ఈ విషయమై మళ్లీ వారికి ఆవేశం కలిగించడం యెందుకూ? అయితే, తక్కిన పటాలు మాత్రం వారు పరిశీలించవలసే వుంటుంది.

రాజరాజు — కనక (చిత్రాంగిపటం తప్ప తన చేతిలో వున్న తక్కినవి అతని కందిస్తూ) ఇవిన్నీ జాగ్రత్త చెయ్యండి.

మహారుద్రయ్య — (అవి పుచ్చుకుని) చిత్తం.

రాజరాజు — ఇక మనమున్నూ వొకమాటలా నదికేసి వెడదాం.

మహారుద్రయ్య — దయచెయ్యండి.

(మహారుద్రయ్య కిందికి చూస్తాడు. వెంటనే మల్లప్ప అనే భటుడు పైకి వస్తాడు. వాడు మహారుద్రయ్య మనిషి. అతని కాంతరంగికుడున్నూ. మహారుద్రయ్య పటాలన్నీ మల్లప్ప కిచ్చి "నగరికి పద" అంటాడు. "చిత్తం" అని వాడు వెళ్లిపోతాడు. రాజూ మంత్రీ అడుగుల్లో అడుగులు వేసుకుంటూ, బయలు దేరతారు.)

రాజరాజు — (గభీ మని ఆగి) మహారుద్రయ్యగారూ!

మహారుద్రయ్య—(ఆగి) చిత్తం మహాప్రభూ!

రాజరాజు—చక్రవర్తుల ప్రవృత్తికీ, తదితరుల ప్రవృత్తికీ అంతరమూ, భేదమూ వున్నాయంటారా లేవంటారా మీరు ?

మహారుద్రయ్య—అయ్యో లేకేం ?

రాజరాజు — తప్పకుండా వుండా లంటారా ?

మహారుద్రయ్య — ఉండితీరాలి. లేకపోతే యెలాగా ? ఆవిశేషం వుండబట్టే కాదూ "నా విష్ణుః పృథివీపతిః" అనడం ?

రాజరాజు—మరిన్నీ చక్రవర్తుల యితివృత్తాలే కదా కవులకు వర్ణించతగ్గవి ?

మహారుద్రయ్య—తదితర్ల యితివృత్తాలూ వొక యితివృత్తాలేనా? ఎంతమాటా?

రాజరాజు — అవునుకదా? అయితే, రామభద్రరాజు కూతురువంటి దేవేరి లేని చక్రవర్తి యితివృత్తంలో జటిలమైన ఘట్టం వొకటయినా వుంటుంది టండీ?

("మహాప్రభూ" అంటూ మహారుద్రయ్యా, "ఆ" అంటూ రాజరాజూ గంభీరంగా చూసుకుంటారు.)

మహారుద్రయ్య—(అలా గంభీరంగానే చూస్తూ సాలోచనగా) అలా సెలవిప్పించారా?......బోధపడ్డది...... బాగుంది... (స్ఫుటంగా) దివ్యంగా వుంది మహాప్రభూ!

రాజరాజు — (ఉల్లాసంతో) బాగా అవగాహన అయినట్టేనా?

మహారుద్రయ్య — క్షుణ్ణంగా అవగాహన అయిపోయింది మహారాజాధిరాజా! తమ వుద్దేశమూ, సంకల్పమూ అనితర దుర్లభంగా వున్నాయి సరసాగ్రేసరచక్రవర్తీ! కాని వొక్క మనవి.

రాజరాజు—ఏమంటారు?

మహారుద్రయ్య—ఇవాళకి నదీవిహారం వద్దు.

రాజరాజు—అలాగే చేతాం.

మహారుద్రయ్య—నగరికే వెళ్లిపోదాం. లేకపోతే విలాసభవనోద్యానం—(అర్థోక్తి)

రాజరాజు—అది బాగుంది.

మహారుద్రయ్య—దయ చెయ్యండి.

(ఇద్దరూ మహోల్లాసంతో వెళ్లిపోతారు)

## రెండో రంగం

రాజరాజునగరిలో వొక గది.

రత్నాంగి పరిచారిక గౌరీ, రాజరాజు పరిచారిక చిట్టీ యెదురెదురుగా నుంచుని వుంటారు.

గౌరి—సరే మరీ. అంత బడలిక అయితే యేం చేస్తామూ ?

చిట్టి—అంతా యింతా కాదు బడలిక. ప్రభువు ఈరాత్రి భోజనం చేస్తారని తోచదు.

గౌరి—అబ్బా!

చిట్టి—మధ్యాహ్నం అలా పవ్వళించి లేచారు, ఇలా పటాల పరిశీలన ప్రారంభించారు. కొంతసేపటి కిక్కడ శ్రాంతులై బురుజుమీదకి వేంచేశారు. మరికొంతసేపటి కక్కడా శ్రాంతులై, అనుష్ఠానసమయం కావడంవల్ల భట్టారకులవారిని పంపేసి విలాసభవనోద్యానంలోకి దయచేశారు. అక్కడ కూడా యిప్పటిదాకా పటాలు చూసిచూసి, యిక భరించలేక, కొట్టేసిన పాములాగ,

యిప్పుడే చలవరాతిన్నె మీద నడుం వా ల్చారు.

గౌరి — ఇలాంటి స్థితిలోనుటమ్మా నేను రాయబారం తెచ్చాను?

చిట్టి — మహారుద్రయ్యగారు కూడా భోజనానికి వెళ్లరుట. వారికి, యిక్కడే ఫల హారం సిద్ధం చేయించి వుంచమని కూడా సెల వయింది.

గౌరి—స—రి!

చిట్టి—"ఈస్థితిలోనా చిట్టీ?" అన్నారు ప్రభువు. నిజంగా నాకు చచ్చినచా వయి పోయింది.

గౌరి— కాదుటమ్మా?

చిట్టి—కనక, యీసంగతి మహారాణీ తో మనవిచెయ్యి.

గౌరి—మంచిదమ్మా మంచిది.

చిట్టి—నాలుగుదినాలకి మళ్లీ యివాళ మహారాణీని సేవించుకోగలుగుతా నను కున్నాను; కాని పెట్టిపుట్టలేదు. చాలా కించపడిపోతున్నాను.

గౌరి—ఏంచెయ్యనూ? నాకూ ఇదే తటస్థించింది కాదూ?

(గౌరి వెళ్లిపోతుంది. ఒక్క నిమిషం అలాగే నుంచుని, చిట్టి, వొక అడుగు వేశాటప్పటికి అన్న పూర్ణ అనే మరొక పరిచారిక యెదురువస్తుంది.)

అన్నపూర్ణ—రహస్యం కామోసు.

చిట్టి—అక్షరాలానూ.

అన్నపూర్ణ— అయితే, శిలాక్షరమే అన్నమాట.

చిట్టి—కాని, నాకూ నీకూ వున్న అనుబంధం తామ్రాక్షరం కాదుటే?

అన్నపూర్ణ—కాకేం? కనక యిప్పుడే చెప్పేస్తావు.

చిట్టి——నేను నీకు మట్టుకే చెబుతాను.

అన్నపూర్ణ——అంచేత అప్పటికీ అది రహస్యమే.

చిట్టి——నువ్వు మరొకర్తికీ, అదిన్నీ యింకొకర్తికీ చెప్పడం జరుగుతుంది కాగా, అప్పటికీ అది రహస్యమే.

అన్నపూర్ణ——సందేహమేం?

చిట్టి——ఇది యిక్కడ యిలాంటి స్థితి లో వుండగా వార్త మహారాణీకి చేరుకుం టుంది.

అన్నపూర్ణ——చల్లగాను.

చిట్టి——అవును. అప్పటి కిక్కడ మన వాళ్ల కందరికీ తెలిసిపోతుంది.

అన్నపూర్ణ—చెప్పే దేమిటే?

చిట్టి—ఇంతలో, అక్కడ కూడా యిది యిలాగే పనకలిసిపోతుంది.

అన్నపూర్ణ—పరిపాటే కాదూ?

చిట్టి—అప్పుడు దానిపేరు?

అన్నపూర్ణ—బహిరంగ రహస్యం.

చిట్టి——అదిగదీ మాట.

అన్నపూర్ణ—మరి విఘ్నేశ్వర పూజ కానియ్యి.

చిట్టి—మహారాణీ వర్తమానించారు.

అన్నపూర్ణ—రాత్రి దయచేస్తామనీ.

చిట్టి—అవును; కాని ప్రభువు బడలికగా వున్నారు.

అన్నపూర్ణ—అదేమిటే ?

చిట్టి—బోలెడు చిత్రపటాలు వచ్చాయి కాదుటే?

అన్నపూర్ణ—అయితే ?

చిట్టి—కన్యావరణం అంటే యేమనుకున్నావు మరి ?

అన్నపూర్ణ— సొంతాని కయితే — (అర్ధోక్తి)

చిట్టి—శాస్త్రం చెప్పినట్టుంది నీ మాట.

అన్నపూర్ణ—ఏమమ్మా ?

చిట్టి—మరొకరికోసం అయితేనే బడలిక మామ్మా.

అన్నపూర్ణ—మరి సొంతాని కయితే?

చిట్టి—విరహమే.

అన్నపూర్ణ—సెబాస్! అయితే, అది మాత్రం కలక్కుండా వుండేటట్టు చూడు.

చిట్టి — అవతల మహారుద్రయ్యగారుండగా, యివతల నీవల్లా నావల్లా యేమవుతుందీ ?

అన్నపూర్ణ—ఇవునేవ్ ! కాని, చివరికేమయినా మన కొకటే. కనక, స్నానాలూ, స్నాన ప్రయత్నాలూ చేసుకుందాం తొరగా రా.

(ఇద్దరూ వెళ్లి పోతారు.)

